వ్యర్థాల కుప్పలు.. స్థానికుల వెతలు

- భరించలేని దుర్వాసనతో నిత్యం అవస్థలు
- తరచూ అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు
- డంపింగ్ యార్డ్ తరలించాలని వినతి
- వాహనాలను అడ్డుకున్న వేమారెడ్డి కాలనీ వాసులు



డంపింగ్ యార్డ్ వద్ద వాహనాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్న వేమారెడ్డి కాలనీ వాసులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ రూరల్‌లో ఇంటింటికీ తిరిగి మున్సిపల్ కార్మికులు సేకరించిన చెత్తను కొలనుకొండ వేమారెడ్డి కాలనీ వద్ద డంపింగ్ చేస్తున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఈ ప్రాంతంలో సోమవారం ఆ కాలనీ వాసులు దీనిపై నిరసన తెలిపారు. దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోయారు. డంపింగ్ యార్డ్‌ను తరలించి తమను కాపాడాలని విన్నవించారు. అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్‌కు వచ్చే వాహనాలను అడ్డుకున్నారు. డ్రైవర్లు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వేమారెడ్డి కాలనీ వాసులు మాట్లాడుతూ.. గతంలో ఎయిమ్స్ రోడ్‌లో ఉండే డంపింగ్ యార్డును వేమారెడ్డి కాలనీలోకి మార్చారని గుర్తుచేశారు. ఇక్కడ దాదాపు 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ఈ డంపింగ్ యార్డు నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని వాపోయారు. చిన్నారులు ఆ వాసనకు వాంతులు చేసుకుంటున్నారని తెలిపారు. ఈగలు, దోమల వల్ల అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాలని కోరారు.

వెంటనే యార్డును తరలించాలి



డంపింగ్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నాం. ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు వచ్చి చెత్తాచెదారాన్ని ఇక్కడ పడేస్తున్నాయి. కుళ్లిపోయిన చెత్త నుండి దుర్వాసన వచ్చి చాలా ఇబ్బందిగా ఉంది. మరి కొంతకాలం ఇలాగే ఉంటే వృద్ధులు, చిన్నారులు, ఇళ్లలో ఉండే మహిళలు అనారోగ్యంపాలు కాక తప్పదు. అధికారులు వెంటనే డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తరలించాలి.

– రాజేశ్వరి

దోమలు, ఈగలతో అల్లాడుతున్నాం



డంపింగ్‌యార్డు వల్ల పెద్ద పెద్ద ఈగలు, దోమలు ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పట్టపగలే దోమలు వచ్చి కుడుతున్నాయి. రాత్రి వేళ ఇక చెప్పే పనే లేదు. ప్రతి ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నాయి. మేమంతా అనారోగ్యం పాలయితే పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఈగలు ప్రతి ఇంట్లోకి వేల సంఖ్యలో వచ్చాయి. తినే ఆహార పదార్థాలపై కూడా వాలుతున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. వెంటనే అధికారులు డంపింగ్ యార్డును మార్చాలి.

– జ్యోతి

అనారోగ్యం పాలవుతున్నాం



గత 20 సంవత్సరాల నుంచి వేమారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాం. కొత్తగా ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. రోజూ నడిచే దారిలో చెత్తాచెదారం వేసి వెళ్లిపోతున్నారు. ఈ వ్యర్థాలకు వచ్చే ఈగలు, దోమల వల్ల ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు నిత్యం అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పుడు జ్వరాలతోపాటు ఒళ్లు నొప్పులు వచ్చిన వారు ఉన్నారు. చంటిపిల్లలు కూడా ఇబ్బంది పడుతున్నారు. కాలనీ నుంచి డంపింగ్ యార్డును తరలించాలని అధికారులను కోరుతున్నాం.

– లావణ్య

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినకాకాని సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మంగళగిరి రూరల్ పరిధిలోని చినకాకాని, కాజ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

గర్భిణులకు పోషకాహారం అవసరం



ఫిరంగిపురం: గర్భిణులతోపాటు బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని బఫర్ వైద్యుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో సోమవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్యశిబిరం నిర్వహించారు. 154 మందికి వైద్యుడు శ్రీకాంత్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ప్రజాదర్బార్'

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ మంగళవారం నుంచి మళ్లీ కొనసాగనుంది. ఆయన కార్యాలయం నుంచి సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలైంది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉండవల్లిలోని నారా లోకేష్ నివాసంలో కార్యక్రమం ఉంటుందన్నారు. 7 గంటలలోపు వచ్చిన వారిని మాత్రమే అనుమతిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

కొత్త రేషన్‌కార్డుల జారీకి వినతి



తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో కొత్త రేషను కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్ మహబూబ్ సుభానిని జనసేన నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను ఆయన కార్యాలయంలో సోమవారం జనసేన మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగ నాయకులు చిట్టెం అవినాష్ తదితరులు కలిశారు. రేషన్ కార్డులు లేక అనేక మంది ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నారని, అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలని తహసీల్దార్‌ను అవినాష్ కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు ఈ సందర్భంగా అవినాష్ జ్ఞాపిక అందించారు.

నియోజకవర్గ మహిళా విభాగం కమిటీ ఎన్నిక



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణానికి చెందిన బుల్లా శారమ్మను ఏపీ చర్మకార సేవా సంఘం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సోమవారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు నియమించారు. మంగళగిరి బాప్టిస్ట్ పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. మహిళా విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. అధ్యక్షులుగా బుల్లా శారమ్మ, ఉపాధ్యక్షులుగా నందిపాముల సునీత, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి సుశీల, కార్యదర్శిగా యర్రగుంట సుశీల, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బేతపూడి అచ్యుత, కోశాధికారిగా వేమూరి అంకమ్మలు ఎన్నికైనట్లు చెప్పారు. సంఘం నాయకులు నందిపాముల జోనిబాబు, గొల్లపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్ : పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఈనెల 8న మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో జెన్‌ప్యాక్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020–24 వరకు డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో పీజీ కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. వివిధ కళాశాలల్లో డిగ్రీ, బీటెక్, పీజీ, ఎంటెక్ పూర్తి చేసినవారంతా పాల్గొనవచ్చునని చెప్పారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ మానస, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు

తాడేపల్లి రూరల్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఆర్. మానస తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ .. తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహారం అన్నారు. పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టాలని, ముర్రిపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని వివరించారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలపైనే బిడ్డ ఆధారపడి ఉండాలని చెప్పారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది, ప్రకాష్‌నగర్, నులకపేట అంగన్‌వాడీ టీచర్లు జి.సుజాత, వి.లత, ఎ.కోటేశ్వరమ్మ, వై.కుమారి తదితరులు పాల్గొన్నారు.

చక్కని చేతిరాతతో బంగారు భవిష్యత్తు

ఫిరంగిపురం: చక్కని చేతి రాతతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని హెచ్‌ఎం జహంగీర్ అన్నారు. మండలంలోని గుండాలపాడు గ్రామంలోని ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో సోమవారం చేతిరాత నిపుణుడు జున్నూ ముద్రింపజేసిన పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. పుస్తకాల ద్వారా చూసి గుండ్రంగా రాయడం నేర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు షకీలాబేగం పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అగ్నిప్రమాదాలపై అవగాహన


మంటను ఆర్పాల్సిన తీరుపై శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం ఫైర్ మాక్‌డ్రిల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లానింగ్, డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సెక్యూరిటీ విజిలెన్స్ సిబ్బందికి ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. మంగళగిరి స్టేషన్ ఫైర్ అధికారి వై. వెంకటేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం పెనుప్రమాదాలకు దారితీసి తీవ్ర నష్టాలను కలిగిస్తుందని చెప్పారు. అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు, నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ ప్రసాద్, పీ అండ్ ఆర్ డీన్ డాక్టర్ వి.రాజేష్, డాక్టర్ జి.ఆర్.కె. ప్రసాద్, అసోసియేట్ డీన్‌లు డి. శేషిరెడ్డి, కె.జె. బ్రహ్మాచారి, వర్సిటీ ఫైర్ ఆఫీసర్ వై. మాణిచంద్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



తాడికొండ: తాడికొండ మండలంలోని లచ్చన్నగుడిపూడి, పాములపాడు, ముక్కామల గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతను కూడా వివరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి–హిందూ విజ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ ప్రచారంలో పలు అంశాలను ప్రజలకు వివరించారు. పలువురు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ


కార్యాలయంలో అర్జీదారులు, అధికారులు

మేడికొండూరు : మండల పరిధిలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. సమస్యలకు సంబంధించి ప్రజలు అర్జీల రూపంలో ఉన్నతాధికారులకు తెలియజేశారు. తహసీల్దారు పద్మనాభుడు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు.

13న అంతర్ కళాశాలల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్ : హిందూ కళాశాల లలిత కళా సమితి, స్టెప్–స్వశక్తి, యువజన సర్వీసుల శాఖ సంయుక్తంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీన అంతర్ కళాశాలల సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి. మల్లికార్జునప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో పోటీలకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కళాశాల స్థాయి విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, బృంద నాట్యం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈనెల 10వ తేదీ లోపు తమ పేర్లను 98481 10174, 96406 80307 ఫోన్ నంబర్లలో నమోదు చేసుకోవాలని కన్వీనర్ డాక్టర్ ఎ.బాలశౌరి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కాళిదాస్ పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు


విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న నాగభూషణం, సీతారామయ్య, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'అమ్మ పేరుతో ఒక్క మొక్క' కార్యక్రమాన్ని అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు సోమవారం సంపత్‌నగర్‌లోని శ్రీరామనామ క్షేత్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు అందరికీ ఉపయోగపడేలా మామిడి, తులసి, మారేడు, దానిమ్మ వంటి మొక్కలను నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. సీతారామయ్య, ఫార్మకాగ్నసీ విభాగాధిపతి డాక్టర్ ఎం. రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. మొక్కలు నాటడంలో సహకారాన్ని అందించిన శ్రీరామనామ క్షేత్రం నిర్వాహకులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు ధన్యవాదాలు తెలిపారు.

మాన్యువల్‌గా పని సర్దుబాటుకు ఎస్టీయూ డిమాండ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటును ఆన్‌లైన్‌కు బదులుగా మాన్యువల్‌గా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. పెదబాబు, డీకే సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలస్థాయిలో సమర్థంగా చేపట్టాలని కోరారు. జీవో నెంబరు 117 ప్రకారం కాకుండా ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా పని భారం మోపకుండా చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేసిన కారణంగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 6 వేలకుపైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు నెలవారీ ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ రిపోర్టు ఇచ్చేందుకు ఆలస్యమయ్యే అవకాశాలున్న దృష్ట్యా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ విధానం అమలు పర్చాలని కోరారు. పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

మేడికొండూరు : మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈ–క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండల డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ–పంట నమోదు కార్యక్రమం మండలంలో అన్ని గ్రామాల్లో జరుగుతుందన్నారు. ప్రతి రైతు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ షాపు నిర్వాహకులకు నోటీసులివ్వండి

- ఎంటీఎంసీ కమిషనర్ ఆదేశం
- నులకపేటలో విస్తృతంగా పర్యటన


నులకపేట బ్రహ్మానందపురంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీంబాషా సోమవారం నులకపేట పరిధిలోని ప్రధాన రహదారిలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గమనించి అసహనం వ్యక్తం చేశారు. వారు చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పారబోయడంపై మందలించారు. అనంతరం నులకపేట అన్న క్యాంటీన్ నుంచి నడుచుకుంటూ గుంటూరు చానల్ వరకు వెళ్లి డ్రైనేజీలను పరిశీలించారు. కాలువల్లో కోడిమాంసం వ్యర్థాలు కనిపించడంతో సిబ్బందిని ప్రశ్నించారు. వారి నుంచి సమాధానం రాకపోవడంతో స్థానికంగా చికెన్ షాపులు నిర్వహించే అందరికీ ముందుగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాలపై కనీసం పట్ట కూడా కట్టడం లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో తెనాలి తాగునీటి పైపులైన్ లీకు కావడంతో అధికారులు తెలియజేయాలని డీఈ కృష్ణారెడ్డిని ఆదేశించారు. నులకపేట కొండ ప్రాంతం నుంచి వచ్చే కచ్చా డ్రైన్‌ను పునరుద్ధరించాలని, కాలువలను ఎవరు ఆక్రమించుకున్నా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిషోర్, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తాడేపల్లి రూరల్: రజకుల సమస్యలను పరిష్కరించాలని, ఇస్త్రీ చేసుకుంటున్న వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలోని చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశానికి ఉండవల్లి పార్థసారథి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో ఇళ్లు లేని వారికి సొంత గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన రజక వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్‌ను నగర పాలక సంస్థ ద్వారా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, ప్రతినిధులు మారుదాటి సుబ్బారావు, కొండాయగుంట యానాదిరావు, తాడేపల్లి వరప్రసాద్, తాడేపల్లి సాంబశివరావు, పిన్నెల్లి లక్ష్మీనారాయణ, సర్వేపల్లి శివయ్య, డి. వీరాంజనేయులు, పూతలపాటి బాలకృష్ణ, కొత్తపల్లి వీరాంజనేయులు, రాయవలస రాజు, తుమ్మపూడి శివయ్య, మానవరపు నరసింహారావు, దుగ్గిరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని మేక మృతి


లారీలు ఆపాలని వాదిస్తున్న దృశ్యం


నిలిచిపోయిన ఇసుక లారీలు

- వాహనాలను అడ్డుకున్న టీడీపీ నేతలు
- పోలీసుల రాకతో కదిలిన లారీలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో ఇసుక లారీలు అడ్డగోలుగా పరుగులు తీస్తుండడంతో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ ఇసుక లారీ ఢీకొట్టడంతో ఓ మేక మృతి చెందింది. టీడీపీ కార్యకర్త రమేష్, మరికొంతమంది సదరు లారీ సహా ఇతర ఇసుక వాహనాలను అడ్డుకున్నారు. లారీ యజమానులు వారితో ఘర్షణకు దిగారు. తమ లారీలకు టాక్స్‌లు చెల్లిస్తున్నామని, ఆపడానికి మీరెవరు అంటూ వెళ్లిపోయారు. అనంతరం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలను టీడీపీ వారు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్ జాం అయింది. ఇరువర్గాల మధ్య కాసేపు స్వల్ప ఘర్షణ జరిగింది. గంటన్నర అనంతరం పోలీసులు రంగప్రవేశం చేశారు. లారీలకు వే బిల్లులు తనిఖీ చేసి పంపారు. తమ్ముళ్లు మాత్రం ఇసుక లారీలు వస్తే సహించబోమని తేల్చిచెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇసుక లారీలు రాకుండా చూడాలని స్థానికులు కోరారు. అధికారులకు చెప్పి నిర్ణయం తీసుకుంటామని పోలీసులు చెప్పారు. చివరికి టీడీపీ వారు ఆ మేకను ఢీకొన్న లారీ యజమాని నుంచి రూ.17 వేలు వసూలు చేశారు. ఆ మొత్తాన్ని మేక యజమానికి అందించారు.

విద్యార్థులకు ఘన స్వాగతం


మాట్లాడుతున్న ఫాదర్ పి.బాలస్వామి

మేడికొండూరు : మండల పరిధిలోని డోగిపర్రు అడ్డరోడ్డులోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కొత్త విద్యార్థులకు స్వాగత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ పి.బాలస్వామి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.కేశవరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, ఎ.ఇన్నారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జయరామిరెడ్డి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ ఎం.కోటిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నగర కమిషనర్ ఎస్. హరికృష్ణ


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న నగర కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ ఎస్.హరికృష్ణ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా ఆయా కార్యదర్శులు తమ పరిధిలో ప్రజల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి అందే అర్జీలను ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ అంశాల వారీగా విభజన చేయాలని చెప్పారు. నాన్ ఫైనాన్స్ అంశాల్ని నిర్దేశిత కాలపరిమితితో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఫైనాన్స్ అంశాల పరిష్కారం కోసం విభాగాధిపతులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలని ఆదేశించారు.